మట్టి వినాయకులను పూజిద్దాం



హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల ప్రతిమలను ప్రతిష్ఠించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాంధీ మంగళవారం ఆయన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ అభినందనీయమన్నారు. 9 సంవత్సరాలుగా హోప్ ఫౌండేషన్ వారు మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజల అనంతరం మన ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శర్మ, మల్లయ్య, రాజు, స్వరూప, కమలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

దుండిగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన దుండిగల్, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా సీడీపీఓ శారద, మండల స్పెషలాఫీసర్ బాబు మోసెస్, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, అంగన్‌వాడి సూపర్‌వైజర్ శోభారాణి, సిబ్బంది ఉన్నారు.

బాధితులకు 10 వేల సాయం అందించాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: వరద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి తక్షణ సాయంగా ప్రకటించిన రూ.10 వేలను సఫ్దార్ నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లలో కూడా అందజేయాలని కార్పొరేటర్ సబిహా బేగం విజ్ఞప్తి చేశారు. మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంత వాసులకు నాటి ప్రభుత్వం రూ.10 వేలను ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా లోతట్టు ప్రాంతాలైన సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లో ఎక్కువ మంది నిరుపేదలు నివసించడంతో పాటు ఇళ్లలో నిత్యావసర వస్తువులతో పాటు విలువైన వస్తువులు సైతం నీళ్ల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్లా, సలీం, రఫీ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత



బాధితులకు సెల్ ఫోన్లను అందజేస్తున్న సీఐ శ్రీనాథ్

శామీర్‌పేట్: పోగొట్టుకున్న, అపహరణకు గురైన సెల్ ఫోన్లను రికవరీ చేసిన శామీర్‌పేట పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాదిలో సెల్ ఫోన్లు పోయినట్లు 19 ఫిర్యాదులు అందాయన్నారు. సాంకేతికతను వినియోగించి ఇప్పటివరకు 11 ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందిచినట్లు తెలిపారు. తమ సెల్‌ఫోన్లను అప్పగించడం పట్ల బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

బాలికల భద్రతకు 'భరోసా'

- ప్రభుత్వ పాఠశాలల్లో సాధికారత కమిటీలు.
- విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు చర్యలు.
- లింగ వివక్ష, హింస, వేధింపులను ఎదుర్కొనేలా శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, హింస, వేధింపులను విద్యార్థి దశ నుంచే అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకుగాను పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్ (కమిటీలు) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం, అప్రమత్తంగా ఉండటం, ఆపదలో స్పందించాల్సిన తీరుపై నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో అవగాహన కల్పిస్తారు.

పోలీసు, విద్యాశాఖ ఆధ్వర్యంలో..

విద్యాశాఖ, పోలీసు శాఖల సమన్వయంతో బాలికా సాధికారత కమిటీలు పని చేస్తాయి. ఇందులో ప్రతి తరగతి నుంచి ఇద్దరు చురుకైన అమ్మాయిలు సభ్యులుగా ఉంటారు. వీరే పాఠశాల బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చైర్మన్‌గా, ఉపాధ్యాయురాలు మెంబర్ కన్వీనర్ గా, షీ టీమ్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. క్లిష్ట పరిస్థితులనూ ధైర్యంగా ఎదుర్కొనేలా, జీవితంలో విజయం సాధించేలా బాలికలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సాధికారత కమిటీలు పని చేస్తాయి. సమాజంలో మహిళలు ముఖ్యంగా బాలికలపై ఎలాంటి అమానుష ఘటనలు జరుగుతున్నాయో వీరికి అవగాహన కల్పిస్తారు. అలాంటి వారిని ఎదుర్కోవాలంటే కేవలం ఒక్కరి వల్లకాదు. మానసిక స్థైర్యానికి తోడు చట్టం అండగా నిలవాల్సి ఉంటోంది. ఆ నమ్మకాన్ని కలిగించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారు.

చేపట్టనున్న కార్యక్రమాలివీ..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో 1808 ప్రభుత్వ పాఠశాలలు(మేడ్చల్ జిల్లాలో 507,రంగారెడ్డిలో 1,301) ఉండగా, దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో దాదాపు సగం బాలికలు ఉన్నారు. ఈ కమిటీల ఏర్పాటు మొదలు.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

- డయల్ 100, 1098, 181, 112 వంటి టోల్ ఫ్రీ నంబర్లను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. బాలికల్లో ఎదుగుదలతో పాటు వచ్చే మార్పులు, శారీరక ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకత, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహచరుల ఒత్తిళ్లకు 'నో' చెప్పడం తదితరాలను అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలు, హింస తదితర సమస్యలపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు, ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు, లైంగిక దాడులు అడ్డుకోవడంపై సదస్సులు నిర్వహిస్తారు. బాలికలు మానసికంగా ధైర్యంగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తారు.

ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతాం



అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో బాలికల సాధికారత క్లబ్ (కమిటీ)ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. బాలికలు ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ధైర్యంగా ఎదుర్కొనేలా సిద్ధం చేస్తాం. బాలికలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. ఆ దిశగా పాఠశాలలు, కుటుంబాలతో పాటు సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది.

–విజయకుమారి,
జిల్లా విద్యాశాఖ అధికారి



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తండ్రి మాధవరం నారాయణ రావు వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు.

– కూకట్‌పల్లి

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

- అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోవాలి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

మోతీనగర్: భవిష్యత్‌లో ముంపు సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్, రాజీవ్ గాంధీ నగర్, సఫ్దార్ నగర్‌లలోని లోతట్టు ప్రాంతాలను మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాముని చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు మధ్య ఉన్న నాలాను ఎస్ఎన్‌డీపీ ఫేజ్ టు క్రింద అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ చిన్నారెడ్డి, డీసీ రమేష్, ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ రంజిత్ కుమార్, నాయకులు మహ్మద్ గౌసుద్దీన్, మహ్మద్ అబ్దుల్ అమీద్, రఫీ, సలీం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు



సమావేశంలో పాల్గొన్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు

రాయదుర్గం: జానపద సాహిత్యాన్ని పరిరక్షించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు.గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో జరిగిన ఉర్దూ జానపద సాహిత్య సాంప్రదాయం'పై ఒక రోజు రీసెర్చ్ స్కాలర్ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీలు కథలు, పాటలు, సామెతలను తరతరాలకు అందజేస్తున్నారన్నారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. కాగా 'మనూ' మ్యూజిక్ క్లబ్ ద్వారా నిర్వహించిన జానపద గానం అందిరినీ విశేషంగా ఆకట్టుకుంది.

చెట్ల కొమ్మల తొలగింపు



ఆదర్శ్‌నగర్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

రంగారెడ్డినగర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలె సంబంధిత శాఖ అధికారులు మరమ్మతు చర్యలు చేపటారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శ్ నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు క్రేన్ సహాయంతో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు.

ఎంఎల్ఆర్ఐటీలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్



దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిద్దేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు.



అక్రమ సెల్లార్లకు అడ్డుకట్టేదీ..?

చెరువులను తలపిస్తున్న సెల్లార్లు

- సర్కిల్-25లో అక్రమ సెల్లార్లకు అనుమతి
- సెల్లార్‌తో చుట్టు పక్కల భవనాలకు పొంచి ఉన్న ప్రమాదం
- స్థానికుల ఫిర్యాదుతో రూ. 2 లక్షల జరిమానా
- ప్రమాదాలు జరిగితే కానీ చర్యలు తీసుకోరా.. అని స్థానికుల ఆగ్రహం

కుత్బుల్లాపూర్: నగర శివారు ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా సెల్లార్లు చెరువులను తలపిస్తున్నాయి. సెల్లార్ వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఇప్పటికే గ్రేటర్ అధికారులు రంగంలోకి దిగారు. అయితే కొన్ని చోట్ల మాత్రం అధికారుల ఉదాసీనత వైఖరి, నిర్లక్ష్యం కారణంగా అక్రమ సెల్లార్లు వెలుస్తున్నాయి. వర్షాకాలంలో ఈ సెల్లార్లకు అనుమతి ఇవ్వడం ఏ స్థాయిలో ప్రమాదాలు జరుగుతాయో తెలిసి కూడా కొందరు అధికారులు అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలోనే కుత్బుల్లాపూర్ సర్కిల్– 25లో మాత్రం అక్రమ సెల్లార్లకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. పేట్ బషీరాబాద్ సమీపంలోని ఎస్వీజీ గ్రాండ్ హోటల్ లైను హైటెన్షన్ రోడ్డులో ఓ వ్యక్తి 400 పైగా గజాల స్థలంలో జోనల్ స్థాయిలో అనుమతి తీసుకొని సెల్లార్ తవ్వకం చేపట్టాడు. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సెల్లార్ చుట్టూ మూడు వైపుల ఉన్న భవనాలకు ప్రమాదం పొంచి ఉంది.

గోడలు కూలుతున్న క్రమంలో...

సెల్లార్ పక్కనే ప్రహరీ గోడలు కూలుతున్న క్రమంలో ఉప కమిషనర్ నరసింహ, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఒకటో తేదీ ఆదివారం అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సందర్శించారు. అనంతరం సెల్లార్ నిర్మాణాన్ని ఆపాలని సదరు యజమానికి ఆదేశాలు జారీ చేసి రూ.2 లక్షలు జరిమానా విధించారు. చుట్టుపక్కల భవనాలకు ఏమైనా జరిగితే దానికి బాధ్యత నాదే అని సంబంధిత యజమానితో లేఖ కూడా రాపించారు. ఈ క్రమంలో సోమవారం సైతం సెల్లార్ పక్కనే ఉన్న ప్రహరీ కూలిపోయింది. సంబంధిత అధికారులు మాత్రం గత నెల రోజుల నుంచి ఇక్కడ సెల్లార్ పనులు జరుగుతున్న పట్టించుకోకుండా, వర్షాలు పడుతున్న క్రమంలో స్థానికుల ఫిర్యాదుతో మేల్కొనడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హడావుడిగా నోటీసు...



హై టెన్షన్ రోడ్డులో జరుగుతున్న సెల్లార్ నిర్మాణంపై అధికారులు హడావుడిగా సోమవారం నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఓ సంస్థ ద్వారా సేకరించిన చెత్తను సెల్లార్‌లో వేసి నింపేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం లేఖ రాశారు. జోనల్ స్థాయిలో అనుమతి తీసుకున్న వ్యక్తి ఓ టౌన్ ప్లానింగ్ అధికారి కనుసన్నల్లో సెల్లార్ తవ్వకాలు చేపట్టగా సదరు అధికారి అకస్మాత్తుగా బదిలీ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి గతంలో ఏమైనా నోటీసులు జారీ చేశారా అన్న విషయాన్ని పరిశీలించగా అటువంటి దాఖలాలు లేకపోవడం విశేషం. అయితే దీనిపై ఆమె వెంటనే స్పందించి సదరు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని నోటీసు జారీ చేయడం కొసమెరుపు. ఏదీ ఏమైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాల డంపింగ్ ధరలను తగ్గించాలి



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: భవన వ్యర్థాల తరలింపు చేసే ట్రాక్టర్స్ వారికి రాంకీ సంస్థ అధిక ధర నిర్ణయించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధర తగ్గించి ఆదుకోవాలని హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సదరు సంస్థ వారు గతంలో భవన వ్యర్థాల తరలింపునకు ట్రాక్టర్ వారికి టన్నుకు రూ.350 రూపాయలు తీసుకొని డంపింగ్ చేయించుకునేవారని, ఇప్పుడు టన్నుకు రూ.418 తీసుకుంటున్నారని వివరించారు. రాంకీ ప్రతినిధులతో మాట్లాడి పాత ధర రూ.350 తీసుకొని డంపింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. రాంకీ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి పాత ధర తీసుకునేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ ప్రతినిధులు రామకృష్ణ, చందు యాదవ్, బాబు మియా, గోపాల్, మారయ్య, శేఖర్, హాఫీజ్‌పేట్ ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు వేణు, మన్యం, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌కు ప్రత్యామ్నాయ రోడ్డు పరిశీలన



కోర్టు కాంప్లెక్స్‌కు ప్రత్యామ్నాయ రోడ్డును పరిశీలిస్తున్న సీనియర్ న్యాయవాదులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు వద్ద కోర్టు కాంప్లెక్స్‌కు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవంతో ప్రతి రోజు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో మంగళవారం ప్రత్యామ్నాయ రోడ్డును సీనియర్ న్యాయవాదులు పరిశీలించారు. దీనిపై అధ్యయనం చేసి రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి ప్రతిపాదించాలని నిర్ణయించారు.

ప్రగతి కళాశాలలో ఫ్రెషర్స్ డే



ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థినులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు కేపీహెచ్‌బీ కాలనీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. దేశ అభ్యున్నతికి మూలమైన యువతలో కొంతమంది మత్తు పదార్థాలకు బానిసలవ్వడం బాధాకరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నయ్య, ఎన్‌సీసీ అధికారి మేజర్ డి. రత్నాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐలో మహిళలకు ప్రత్యేక శిక్షణ

రాయదుర్గం: సౌత్ ఏషియన్ విమెన్స్ ఇన్ టెక్ (ఎస్ఏడబ్ల్యూఐటీ) పలు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మంగళవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ వేదికగా ప్రకటించింది. ముఖ్యంగా కోటి మందికి మహిళలకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు గూగుల్ విమెన్ టెక్ మేకర్స్, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్, ఫిక్కీ ఎఫ్ఎల్ఓ, షిరోస్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఐటీ–ఐటీఈఎస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఎస్ఏసీ నాస్కామ్ సీఈఓ కీర్తి సేథ్ మాట్లాడుతూ సాంకేతికతలో మహిళల పురోగమనం అని పేర్కొన్నారు. అనితానటరాజన్ మాట్లాడుతూ భారతదేశంలో ఏఐ వృత్తి నిపుణులలో 20 శాతం కన్నా తక్కువ మంది మహిళలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కలిడో సహ వ్యవస్థాపకుడు సంజయ్‌వర్మ ప్రసంగించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ



గాయపడిన శౌర్యసింగ్

కుత్బుల్లాపూర్: విద్యార్థుల మధ్య జరిగిన గొడవ పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఓ కాలేజీ హాస్టల్ గదిలో ఉంటున్న వీరు మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గొడవకు దిగి శౌర్యసింగ్ అనే విద్యార్థి పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతను యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. మెదక్ జిల్లాకు చెందిన శౌర్యసింగ్(14) ఆయతీ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ కొంపల్లి సినీ ప్లానెట్ వెనక ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. అదే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్ 2లోని జలకన్య హోటల్ వద్ద ఉన్న పార్కులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.